సింగరేణి జాయింట్ వెంచర్‌ను ఒప్పుకోం

తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : రామగుండం థర్మల్ ప్లాంట్‌ను సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించేందుకు ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదని, ఈ ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం చేసింది. జాయింట్ వెంచర్ అంటే ప్రైవేటీకరణను ప్రోత్సహించడమేనని జేఏసీ నేతలు ఆరోపించారు. జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం ఖైరతాబాద్‌లోని విద్యుత్ సౌధలో జేఏసీ నేతలు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ.. మూడేండ్లుగా జెన్‌కో లాభాల్లో నడుస్తున్నదని, 2020-21లో రూ. 168 కోట్లు, 2021-22లో రూ.394.46 కోట్లు, 2022-23లో రూ.472.94 కోట్ల లాభాలను ఆర్జించిందని తెలిపారు. జెన్‌కో ఈక్విటీతోనే రామగుండంలో నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ బీసీ రెడ్డి, వజీర్, మాజీద్, రమేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉత్పత్తి లక్ష్యం పెంపు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి లక్ష్యాన్ని క్రమంగా పెంచుకుంటున్నది. ఇది వరకు రోజుకు రెండు లక్షల బొగ్గును ఉత్పత్తి, రవాణా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ.. తాజాగా దీనిని 2.1 లక్షల టన్నులకు పెంచుకున్నది. బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని కంపెనీ సీఎండీ ఎన్ బలరాం ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో పాటు రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని అన్ని ప్రాంతాల జీఎంలకు ఆయన ఆదేశాలిచ్చారు. భారీ వర్షాలతో కొద్ది రోజుల పాటు సింగరేణిలో ఉత్పత్తి నిలిచిపోగా, వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా ఈ లక్ష్యాన్ని నిర్ధేశించారు.

● నల్లబ్యాడ్జీలతో కేటీపీపీ ఉద్యోగుల నిరసన

థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాలను జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యాన్ని అంగీకరించబోమని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని కేటీపీపీలో శనివారం ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. - గణపురం

చేనేత రుణమాఫీ ఏమాయే..!

- ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేస్తున్న కాంగ్రెస్ సర్కారు
- తీవ్ర ఆవేదనలో చేనేత కార్మికులు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాఫీ చేస్తామని మాట ఇచ్చిన ప్రభుత్వం.. ఇంతవరకు పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 10 వేల మంది కార్మికులు ఈ మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 'చేనేత పాలసీ' అనేది ఏదీ లేదని చేనేత కార్మికులు మండిపడుతున్నారు. చేనేతలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని చేనేత కార్మికసంఘం రాష్ట్ర నాయకులు కూరపాటి రమేశ్, చెరుకు స్వామి విమర్శిస్తున్నారు. మరికొన్ని డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

- చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించాలి.
- చేనేతల కోసం రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలనే డిమాండ్‌ను నెరవేర్చాలి
- త్రిఫ్ట్ ఫండ్, యూరన్ సబ్సిడీ, నేతన్నకు బీమా పథకాలు అమలు చేయాలి
- బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- వస్త్రనిల్వలు వెంటనే కొనుగోలు చేయాలి
- వర్కర్ టూ ఓనర్, జనతా వస్త్ర పథకాలను అమలు చేయాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి
- యూరన్ సబ్సిడీ నిధులను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి
- ప్రతి నేతన్నకు పెట్టుబడిసాయం కింద రూ.5 లక్షలు అందించాలి
- ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్త్రాలను రాష్ట్రంలో ఉత్పత్తి చేయించాలి.

టీ కొట్టు శివకు ఐదు కొలువులు

- పోటీ పరీక్షల్లో పెద్దపల్లి జిల్లా ధర్మారం యువకుడి సత్తా
- గత మార్చిలో గురుకుల జేఎల్, పీజీటీ, టీజీటీల్లో ప్రతిభ
- తాజాగా జేఎల్, డీఎస్సీలో విజయ ధంకా

మహేశ్ కుమార్

ధర్మారం, అక్టోబర్ 5: ఓ పేదింటి బిడ్డ.. ప్రభుత్వ కొలువులు కొల్లగొట్టాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులతో కొన్నాళ్లు టీకొట్టు నడిపిన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఉడాన్ శివ మహేశ్ కుమార్.. ఆరు నెలల్లోనే ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తాచాటాడు. ధర్మారానికి చెందిన ఉడాన్ సుశీల-లక్ష్మణ్ దంపతులకు శివ మహేశ్ రెండో కొడుకు. ధర్మారంలో చదువుకుంటూనే తల్లిదండ్రులకు సాయపడేవాడు. 2014లో సునీతను వివాహం చేసుకున్నాడు. 2020లో పీజీ పూర్తిచేశాడు. కరోనా టైంలో రాజారాంపల్లిలో టీకొట్టు నడిపాడు. తర్వాత దానిని వదిలేసి తల్లిదండ్రులు, మిత్రుల సహకారంతో 2022లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో గురుకులాల లెక్చరర్, టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. అదే ఏడాది ఆగస్టులో పరీక్షలు రాశాడు. గత మార్చిలో ఫలితాలు రాగా.. జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ కొలువులకు ఎంపికయ్యాడు. జూనియర్ లెక్చరర్ పోస్టును ఎంపిక చేసుకొని ప్రస్తుతం నిర్మల్ జిల్లా మామడలోని గురుకులంలో పనిచేస్తున్నాడు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్‌లో నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల భర్తీ పరీక్ష, ప్రస్తుత ప్రభుత్వం ఆగస్టు 2024లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలు రాసి ప్రతిభ చాటాడు. ఇటీవలే విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్, డీఎస్సీ ఫలితాల్లో పెద్దపల్లి జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఈ విజయం తన తల్లిదండ్రులకే అంకితమని శివమహేశ్ తెలిపారు.

నిలిచిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పలు జిల్లాల్లో డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిలిచిపోయింది. కొన్ని జిల్లాల్లో ఇంకా 1:3 జాబితాలు విడుదల కాలేదు. కోర్టుకేసుల కారణంగా నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. శనివారం వరకు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్, భాషాపండితులు, పీఈటీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాగా, స్పెషల్ ఎడ్యుకేషన్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కోర్టుకేసులు లేని జిల్లాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తిచేశామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తెలిపారు.

- నల్లగొండలో ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కానీ ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ జాబితాలో 31కి 29 మంది హాజరయ్యారు.

హరీశ్ (ఫైల్) | సురేశ్ (ఫైల్) | హేమలత (ఫైల్)

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కుటుంబం బలి

- రూ.30 లక్షలకుపైగా కుమారుడి అప్పులు
- 20 గుంటల భూమి అమ్మి అప్పుల చెల్లింపు
- మనస్తాపంతో కుమారుడితోపాటు తల్లిదండ్రుల ఆత్మహత్య
- నిజామాబాద్ జిల్లా వడ్డేపల్లిలో విషాదం

ఎడపల్లి, అక్టోబర్ 5: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో కుటుంబం బలైంది. రూ.లక్షలు పోగొట్టిన ఓ యువకుడితోపాటు అతడి తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన శనివారం నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగణవేణి సురేశ్ (55), హేమలత (48) దంపతులకు ఇద్దరు సంతానం. మెదడు వాపు వ్యాధితో కూతురు చిన్నప్పుడే మృతి చెందింది. ఏకైక కుమారుడు హరీశ్ (22) నిజామాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. ఆర్నెళ్ల క్రితం పని మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. సురేశ్ దంపతులు చిన్న కిరాణషాపు నడుపుతూ వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కొత్త ఇల్లు కట్టుకుందామన్న ఆశతో గృహ నిర్మాణాన్ని ప్రారంభించారు. కుమారుడు హరీశ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి భారీగా అప్పులు చేశాడు. దీంతో తల్లిదండ్రులు ఇంటి నిర్మాణాన్ని ఆపేశారు. హరీశ్ చేసిన రూ.30 లక్షలకుపైగా అప్పులను తమకున్న 20 గుంటల భూమిని అమ్మేసి తీర్చారు. అయినప్పటికీ కుమారుడిలో మార్పు రాలేదు. నలుగురిలో తిరగలేక మనస్తాపం చెందిన తల్లిదండ్రులు, కుమారుడు శుక్రవారం రాత్రి ఉరేసుకున్నారు. తెల్లారినా ఎలాంటి అలికిడి లేకపోవడంతో ఇరుగుపొరుగు ఇంటి వెనుక నుంచి చూడగా వేలాడుతూ కనిపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాండాలో జనగామవాసి హత్య

సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో ప్రాణాలొదిలిన తిరుమలేశ్

తిరుమలేశ్ (ఫైల్)

జనగామ చౌరస్తా, అక్టోబర్ 5 : ఉగాండా దేశంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జనగామవాసి ఇటికాల తిరుమలేశ్ (41) శుక్రవారం అక్కడ హత్యకు గురయ్యాడు. మృతుడి తమ్ముడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డ ఏరియాకు చెందిన తాపీ మేస్త్రీ ఇటికాల కిష్టయ్య-కిష్టమ్మ దంపతుల పెద్ద కుమారుడు తిరుమలేశ్ నల్లగొండ జిల్లాకు చెందిన రాయల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 2014 నుంచి ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ కంపెనీకి ఉగాండాలోని నమ్మసాలలో బ్రాంచ్ కార్యాలయం ఉండటంతో 15 నెలల నుంచి భార్య, కుమారుడితో కలిసి తిరుమలేశ్ అక్కడే ఉంటున్నాడు. గురువారం ఉదయం 9.30 గంటలకు (ఉగాండా కాలమానం ప్రకారం) డ్యూటీకి వెళ్లాడు. అక్కడ కొత్తగా విధుల్లో చేరిన సెక్యూరిటీ గార్డు ఓపియో మద్యం మత్తులో గాల్లోకి కాల్పులు జరుపుతుండగా సహోద్యోగులతో కలిసి తిరుమలేశ్ బయటకు వచ్చాడు. సెక్యూరిటీగార్డు విచక్షణ కోల్పోయి తిరుమలేశ్‌పైకి కాల్పులు జరపగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తిరుమలేశ్ భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కాగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో వారిని పరామర్శించారు.

కుంటలో పడి వ్యక్తి మృతి

గూండ్ల నర్సింహులు (ఫైల్)

శక్కర్‌నగర్, అక్టోబర్ 5: బోధన్ పట్టణం రాకాసీపేట్‌లోని కర్ణంకుంటలో పడి గూండ్ల నర్సింహులు (40) మృతిచెందాడు. అదే ప్రాంతానికి చెందిన నర్సింహులు ఈనెల 4న రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో నిద్రమత్తులో మూత్రానికి వెళ్లి సమీపంలోని కర్ణంకుంటలో పడి మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ పట్టన సీఐ వెంకటనారాయణ తెలిపారు.

డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు ఆత్మహత్యాయత్నం

నవీపేట, అక్టోబర్ 5: డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన ప్రవీణ్ గౌడ్ ఇంటి నిర్మాణం కోసం అదే గ్రామానికి చెందిన సూర నర్సయ్య కొన్ని రోజుల క్రితం ఇటుకలు, ఇతర సామగ్రిని సరఫరా చేశాడు. వాటి డబ్బులు ఇవ్వాలని సూర నర్సయ్య.. ప్రవీణ్‌గౌడ్ ఇంటికి వెళ్లి నిలదీశాడు. అవమానానికి గురైన ప్రవీణ్ గౌడ్ శుక్రవారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రవీణ్‌గౌడ్ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు నర్సయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సారెస్పీకి 40 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మోర్తాడ్, అక్టోబర్ 5: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు శనివారం వరద ఉధృతి తగ్గడంతో మధ్యాహ్నం గేట్లు మూసివేశారు. తిరిగి సాయంత్రం వరద ఉధృతి పెరగడంతో మళ్లీ నాలుగు గేట్లు ఎత్తి, మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేశారు. శనివారం 27,607 ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు ప్రాజెక్ట్ 6 గేట్లు ఎత్తి 18 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీలు) కాగా, ప్రాజెక్ట్‌లో 1091 అడుగుల (80.501టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 6,800 క్యూసెక్కులు, ఎస్కేప్‌గేట్ల ద్వారా 1200 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, వరద కాలువకు 12వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు.

డీఎస్సీ అభ్యర్థుల జాబితాల్లో సాంకేతికలోపం

- రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బీటీఏ సంఘం ప్రతినిధులు

ఖలీల్‌వాడి అక్టోబర్ 5 : జిల్లాలో డీఎస్సీ క్వాలిఫై అయిన అభ్యర్థుల సర్టిఫికేషన్ వెరిఫికేషన్ ప్రక్రియలో సాంకేతిక లోపాలు ఉన్నాయని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) ప్రతినిధులు ఆరోపించారు. సాంకేతికలోపంతో జరిగే తప్పిదాల వల్ల అభ్యర్థులు ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని అన్నారు. జిల్లాకేంద్రంలోని నిర్మల హృదయ్ పాఠశాలలో శనివారం చేపట్టిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను విద్యాశాఖ రాష్ట్ర అడిషినల్ డైరెక్టర్ రమేశ్, డీఈవో దుర్గాప్రసాద్ సందర్శించారు. వారికి బీటీఏ సంఘం ప్రధానకార్యదర్శి స్వామీనాయక్ సాంకేతిక లోపాలపై వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. ఒక అభ్యర్థి మూడు సబ్జెక్టుల్లో వెరిఫికేషన్‌కు హాజరుకాగా.. ఎస్ఏ బయో సైన్స్ సబ్జెక్టులో టెట్ మార్కులు 11.73 యాడ్ అయ్యాయని, హిందీలో 9.47 మార్కులు మాత్రమే యాడ్ అయ్యి ఉద్యోగం కోల్పోయే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. వీటితోపాటు ఫేక్ సర్టిఫికెట్లు తీసుకువస్తున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు.

ఘనంగా 'నానే బియ్యం' బతుకమ్మ

నవీపేట మండలకేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మానిక్‌బండార్‌లోని విజయ్‌రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో..

బాల్కొండలోని కృష్ణవేణి పాఠశాలలో..

జిల్లాకేంద్రంలోని ఎస్ఎస్ఆర్ కళాశాలలో..

జిల్లాకేంద్రంలోని కేర్ డిగ్రీ కళాశాలలో..

ఖలీల్‌వాడి/ సుభాష్‌నగర్/ కోటగిరి/ మోస్రా (చందూర్)/ మోర్తాడ్/ మాక్లూర్/ బాల్కొండ/ నవీపేట, అక్టోబర్ 5 : బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా నాల్గో రోజు శనివారం 'నానే బియ్యం బతుకమ్మ'ను మహిళలు ఉత్సాహంగా జరుపుకొన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రధాన చౌరస్తాల వద్ద, నవీపేట మండలం కేంద్రంలో, నగరంలోని కోర్టు ప్రాంగణంలో, నగరంలోరి కేర్ డిగ్రీ కళాశాల, ఎస్ఎస్ఆర్ కళాశాల, కమ్మర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, మానిక్‌బండార్‌లోని విజయ్‌రూరల్ ఇంజినీరింగ్ కళాశాల, బాల్కొండలోని కృష్ణవేణి పాఠశాలలో విద్యార్థినులు బతుకమ్మల సంబురాల్లో సందడి చేశారు.

కమ్మర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

తిలక్‌గార్డెన్ పోస్టాఫీస్ ప్రాంగణంలో..

కోటగిరి మండలం ఎత్తొండలో..

'మా స్థలాన్ని మాకు అప్పగించండి'

ఆందోళన చేస్తున్న కొండాపూర్ గ్రామస్తులు

రుద్రూర్, అక్టోబర్ 5 : కబ్జాకు గురైన తమ స్థలాన్ని తమకు అప్పగించాలని కోరుతూ కొండాపూర్ గ్రామస్తులు శనివారం ఆందోళనకు దిగారు. గైనిగుట్టల బసవేశ్వర ఆలయం పక్కన ఉన్న గ్రామ స్థలాన్ని కబ్జా నుంచి విడిపించి, పేదలమైన తమకు అప్పగించాలని కోరారు. గతంలో కొంతమంది పేర్లపై ఉన్న స్థలాన్ని ఓ వ్యక్తికి కొంతమంది గ్రామస్తులు విక్రయించారని, విక్రయించిన స్థలం కన్నా ఎక్కువ స్థలాన్ని కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు సర్వే చేపట్టి నిరుపేదలమైన తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు సాయిలు, బాలకృష్ణ, కిరణ్, నారాయణ, ప్రభాకర్, పోశెట్టి, బస్వయ్య, గంగారాం, పవన్ పాల్గొన్నారు.

బైక్ చోరీ నిందితుల అరెస్టు

వినాయక్‌నగర్, అక్టోబర్ 5 : జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో బైకులను చోరీ చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు శనివారం అరెస్టుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని న్యాల్‌కల్ రోడ్డు చౌరస్తా వద్ద సీసీఎస్, టూ టౌన్ పోలీసులు శనివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులను నిలిపి, వాహనపత్రాలు చూపించాలని పోలీసులు అడగగా.. పత్రాలు లేకపోవడం, అనుమానాస్పదంగా కనిపించడంతో విచారణ చేపట్టారు. 1, 2, 4, 5వ టౌన్ల పరిధిలో ఐదు బైకులు చోరీలు చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. నిందితులను నగరంలోని ధర్మపురిహిల్స్‌కు చెందిన నీలా నర్సింహ, మోపాల్ మండలం ముదక్‌పల్లి గ్రామానికి చెందిన ఫెరోజ్‌ఖాన్‌గా గుర్తించి, వారి నుంచి చోరీ చేసిన ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల

ఖలీల్‌వాడి, అక్టోబర్ 5 : రాష్ట్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి సంబంధించిన మధ్యాహ్న భోజన బిల్లులను శనివారం విడుదల చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4 నుంచి 10వ తరగతుల కుకింగ్ కాస్ట్‌కు రూ. 2 కోట్ల 21 లక్షల 17 వేల 866 బడ్జెట్‌ను మండలాల వారీగా ఐఎఫ్ ఎంఐవోస్ ద్వారా బిల్లులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలి

- వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్

జీజీహెచ్‌లో వైద్యసేవలపై ఆరా తీస్తున్న అజయ్‌కుమార్

ఖలీల్‌వాడి/ ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 5 : ప్రభుత్వ దవాఖానల్లో వైద్యులు అందుబాటులో ఉండి, రోగులకు మెరుగైన సేవలందించాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానతోపాటు ఆర్మూర్ పట్టణంలోని ఏరియా దవాఖానను ఆయన శనివారం పరిశీలించారు. ఆరోగ్య సదుపాయాలను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు ప్రత్యేకంగా అధికారులను నియమించిందని, ఇందులో భాగంగా దవాఖానలను పరిశీలించినట్లు తెలిపారు. జీజీహెచ్‌లో కలియతిరిగి ఫీవర్ వార్డుతోపాటు ఇతర వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు సమయపాలన పాటించాలని, వైద్య సిబ్బంది రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానల్లో వైద్యుల ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని అన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో దవాఖాన సూపరింటెండెంట్ ప్రతిమారాజ్.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దవాఖానలో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీసీహెచ్ శ్రీనివాస్, సర్వే అండ్ ల్యాండ్స్ అధికారి నాగరాజు, దవాఖాన సూపరింటెండెంట్ రవికుమార్, వైద్యులు అమృత్, రాంరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి సోయా గింజనూ కొనుగోలు చేయాలి

- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వేల్పూర్, అక్టోబర్ 5 : రైతులు పండించిన ప్రతి సోయా గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వేల్పూర్‌లో ఆపార్టీ నాయకులు శేఖర్‌రెడ్డి, నాగధర్, ఏలియా శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రైతులు పండించిన సోయాలను ఎకరానికి 6 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. ప్రతి పంటనూ కొనుగోలు చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మారుస్తున్నారని అన్నారు. సోయా పంటకు మద్దతు ధర రూ.4,892తోపాటు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం చివరి గింజ వరకూ కొనుగోలు చేసిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు పెడుతూ రైతులను మోసం చేస్తున్నదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నల్ల రమేశ్, పాలె భూపాలరాజ్, దుల్ల రాజేశ్వర్, గంగారెడ్డి, రేగుల రాములు పాల్గొన్నారు.

పాన్ షాపు దగ్ధం

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 5: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో శుక్రవారం రాత్రి ఓ పాన్ షాప్ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. అటువైపు వెళ్తున్న స్థానికులు చూసి షాపు యజమాని సతీశ్‌తోపాటు అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.లక్షన్నర ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.